క్లుప్తంగా

నేడు సత్తెమ్మతల్లి జాతర



సత్తెమ్మతల్లి

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి వార్షిక జాతర శుక్రవారం జరగనుంది. జాతరను నిర్వహణకు ఆలయ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. తెల్లవారుజామున సుప్రభాత సేవ, ఆరాధన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం తీర్థమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపకాంతులతో, మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులకు ఆలయం వద్ద ఉచిత ప్రసాదం, మధ్యాహ్నం అన్నసమారాధన జరపనున్నారు. మజ్జిగ, మంచినీరు పంపిణీ ఏర్పాట్లు చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, ఆశీస్సులు పొందాల్సిందిగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు కోరారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



దుర్గమాంబ సన్నిధిలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామంలో కొలువైన దుర్గమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను గురువారం భక్తి శ్రద్ధలో నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్ బండారు కల్పన ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రబాబు, విజయ్‌లు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. బీజేపీ స్థానిక నాయకులు బి.రాజశేఖర్, కూండ్రపు సోమునాయుడు, రాజేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మోస రామకృష్ణ, నూకరాజు, నాగరాజు, జనసేన వీర మహిళ పావని నాయుడు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం మేనేజర్ దుర్గాప్రసాద్

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్మాణ భారత్, టెక్ మహీంద్ర ఫౌండేషన్, స్మార్ట్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉపాధి, ఉద్యోగ కల్పనకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం మేనేజర్ దుర్గాప్రసాద్ వెలమల పాల్గొని సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహనతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనీ మొబిలైజర్ దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ వీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం బస్ స్టేషన్లో ఆర్ఎం తనిఖీలు



ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

సింహాచలం: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లను పరిశీలించి, నిర్వహణపై ఆరా తీశారు. స్టాల్స్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని వ్యాపారులంతా పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గుడ్డ, నారతో చేసిన సంచులను మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారావు, అసిస్టెంట్ ఇంజినీర్ నాయుడు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో గ్లకోమా ఉచిత స్క్రీనింగ్

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఈ నెల 14 నుంచి 16 వరకు గ్లకోమా ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు గురువారం తెలిపారు. ఆస్పత్రిలో ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న గ్లకోమా వారోత్సవాల సందర్భంగా ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 40 ఏళ్ల పైబడి వయసున్న వ్యక్తులు, గ్లకోమాతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్లకోమా వ్యాధి ఉందన్న భావన కలిగితే ఫీల్డ్ అనాలసిస్‌కు 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి సి బ్లాక్‌లో ప్రత్యేకంగా గ్లకోమా స్క్రీనింగ్ కౌంటర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆక్రమణలు.. అక్రమ నిర్మాణాలు

- ప్రభుత్వ భూముల్లో కూటమి నేతల దందా
- ఖాళీ స్థలాలను ఆక్రమించి, ప్లాట్లుగా విక్రయాలు
- స్థానికుల ఫిర్యాదుల్ని పట్టించుకోని అధికారులు

మండలంలోని అసకపల్లి, సబ్బవరం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కూటమి నేతల అండతో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవట్లేదు. ఈ అక్రమాల వెనుక క్షేత్రస్థాయి సిబ్బంది అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



అసకపల్లి సర్వే నెం.1లో హెచ్చరికల బోర్డును పట్టించుకోకుండా చేపడుతున్న నిర్మాణాలు

గత ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డుకట్ట

నక్కవానిపాలెం సమీపంలో సర్వే నెం.87లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు 20 ఎకరాల వరకూ భూమిని సేకరించి వైఎస్సార్ అర్బన్ హౌసింగ్ లే అవుట్‌ను ఏర్పాటు చేశారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్లాట్‌లు వేసి, గృహ నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ఉన్న కొంత మిగులు భూమిపై అక్రమార్కుల కన్నుపడింది. గతంలోనే ప్లాట్‌లు వేసి, విక్రయాలకు పాల్పడ్డ వారిపై ఫిర్యాదులు అందడంతో ఆర్ఐ వీరయ్య, అప్పటి వీఆర్వో విజయశ్రీ హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేసి, అక్రమాలకు అడ్డుకట్ట వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యథావిధిగా ఆక్రమణలు, నిర్మాణాలు, అమ్మకాలు జరిగిపోతున్నాయి. హెచ్చరికల బోర్డులను బేఖాతరు చేసి మరీ నిర్మాణాలు చేపట్టడం వెనుక రెవెన్యూ సిబ్బంది ముడుపుల వ్యవహారంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అసకపల్లి సర్వే నెం.87లోని ప్రభుత్వ భూమిలో గృహ నిర్మాణాలు

సబ్బవరం: మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కూటమి నేతల అండదండలతో చోటా నేతలు ప్లాట్లు, షెడ్లు వేసి మరీ విక్రయాలు జరుపుతున్నారు. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకునే పేద, దిగువ మధ్యతరగతి ప్రజల్ని లక్ష్యంగా చేసుకుని ప్లాట్లను రూ.లక్షలకు విక్రయిస్తూ అక్రమార్జన చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయ, పంచాయతీ కార్యాలయ సిబ్బంది అండదండలున్నవారు ఓ అడుగు ముందుకేసి షెడ్లు నిర్మించి విద్యుత్ కనెక్షన్లు, ఇంటి పన్నులు వేయించి మరీ అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం కళ్లకు ముడుపుల గంతలు కట్టుకుని, మిన్నకుండిపోతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవట్లేదని ఆక్షేపిస్తున్నారు. వీటన్నింటి వెనుక కూటమి పార్టీల ప్రధాన నేతలకు అందుతున్న భారీ ముడుపులే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫిర్యాదుల్ని పట్టించుకోని అధికారులు

అసకపల్లి రెవెన్యూ పరిధి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న వజ్రాలకొండపై రాత్రి పూట గ్రావెల్ తవ్వకాలు చేపట్టి, తరలిస్తూ ప్రభుత్వ భూమిని చదును చేసి ప్లాట్‌లు వేస్తున్నారు. ఒక్కో ప్లాట్‌ను రూ.లక్షల్లో విక్రయిస్తూ అందినకాడికి కొల్లగొడుతున్నారని స్థానిక సర్పంచ్‌తోపాటు, గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకున్న పాపానపోలేదని వాపోతున్నారు. ఇటీవల అసకపల్లిలో అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. వీటికి ఇంటి పన్నులు, విద్యుత్ కనెక్షన్లు కూడా ఇస్తున్నారని, అందుకు సహకరిస్తున్న స్థానిక నాయకులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ఎంపీడీవోకూ ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు తీసుకున్న పాపానపోలేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.



ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు సిద్ధం చేసిన ఇసుక, పిక్క

ప్లాట్లుగా విభజించి.. విక్రయిస్తున్నారు

అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెం.1లో సుమారు 250 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భూమిని గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించింది. మిగిలిన విలువైన ప్రభుత్వ భూమి అక్రమార్కుల చేతుల్లో కబ్జాకు గురైంది. స్థానికంగా ఉండే కొందరు నాయకులు, కూటమి నేతలతో కలిసి, 2 సెంట్లు, 3 సెంట్లు చొప్పున చిన్నచిన్న ప్లాట్లుగా విభజించి, విక్రయిస్తున్నారు. దగ్గర్లోని గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి వీటికి అవసరమైన రోడ్లను వేస్తున్నారు. వీటిని చూపించి మధ్య, దిగువ **మధ్య తరగతి** ప్రజలకు తక్కువ ధర ఆశ **చూపి అమ్మకాలు** చేపడుతున్నారు. కొంత **మంది మరింత** ముందుకు వెళ్లి, చిన్నచిన్న **షెడ్లు వేసి, వాటి**కి ఇంటిపన్ను, కరెంట్ కనె**క్షన్లు ఇప్పించి** మరీ విక్రయిస్తున్నారు. దీనికి **క్షేత్రస్థాయిలో** ఉండే వీఆర్వోలు, పంచా**యతీ కార్యద**ర్శులు సహకరిస్తున్నారనే **ఆరోపణలున్నా**యి.

క్రిమినల్ చర్యలు తీసుకుంటాం



అసకపల్లి రెవెన్యూ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఆర్ఐ, వీఆర్వోలు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను పరిశీలించి, హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన, వాటిలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా లేండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– బి.చిన్నికృష్ణ, తహసీల్దార్, సబ్బవరం మండలం

లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి



వినతిపత్రం అందిస్తున్న గొర్లివానిపాలెం గ్రామస్తులు

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెంలో లోఓల్టేజ్ కారణంగా గృహోపకరణాలు పాడవుతున్నాయని, విద్యుత్ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదని గ్రామస్తులు చిప్పాడ రామారావు, టి.గోవిందరావు, పి.అప్పారావు విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు హాజరైన రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణకు విన్నవించారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జేఎన్‌పీసీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. గ్రామంలో సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్‌కు బదులుగా డబుల్ ఫేస్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేసి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీహెచ్.అప్పారావు, పి.మహాలక్ష్మి ఉన్నారు.

నిబంధనల మేరకు కార్మికులకు జీతాలు చెల్లించాలి



సబ్బవరం ఎస్‌టీబీఎల్ హోటల్ సిబ్బందితో కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ, తదితరులు

సబ్బవరం: కార్మిక చట్టం నిబంధనల మేరకు కార్మికులకు జీతాలను చెల్లించాలని చోడవరం సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ సంబంధిత యాజమాన్యాలకు సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో సబ్బవరంలోని పలు వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, సంస్థల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. తక్కువ జీతం చెల్లిస్తున్న యజమానుల నుంచి వ్యత్యాస జీతంపై క్లెయిం దాఖలు చేస్తామని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండని బాలలచే పనులు చేయించరాదన్నారు. సప్తగిరి వైభవ్ క్లాత్ షాపులో పనిచేస్తున్న ఓ అమ్మాయికి, అప్‌డేట్ ఫ్యాషన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు అమ్మాయిలకు తక్కువ జీతం చెల్లిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. కార్మిక శాఖ అధికారులతో పాటు ఐసీడీఎస్, సీడ్స్ ఆర్గనైజేషన్, పోలీస్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సబ్బవరం సీఐ రమణ, అనకాపల్లి సహాయ కార్మిక అధికారులు బాలకృష్ణ, నరేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడ్స్ తరఫున చిన్నారావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

చెప్పుల దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.15 లక్షల ఆస్తి నష్టం



కాలి బూడిదైన చెప్పులు, ఫర్నిచర్

పరవాడ: సంతబయలు గ్రామానికి చెందిన భూషణం చెప్పుల దుకాణంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం జరిగింది. వివరాలు.. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో దుకాణం మూసివేసి, భూషణం ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో షాపు నుంచి దట్టమైన పొగలు రావడాన్ని స్థానికులు గుర్తించి అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించారు. వెంటనే రాంకీ అగ్నిమాపక శకటం సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న చెప్పులు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయి, ముద్దగా మారాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని కొందరు, ఎవరో కావాలనే షాపునకు నిప్పు అంటించారని మరి కొందరు అంటున్నారు. చెప్పుల దుకాణం వెనుక వైపు నివసిస్తున్న సైకిల్ మెకానిక్ చెల్లయ్య అనే వ్యక్తికి చెందిన టైర్లు, ట్యూబులు కాలిబూడిదైనట్లు చెల్లయ్య వాపోయాడు. అగ్నిప్రమాదంపై పరవాడ రెవెన్యూ అధికారులు బాధితుల నుంచి వివరాలు సేకరించి, నివేదికను తహసీల్దార్ అంబేడ్కర్ అందించారు.

శాకాహారంతో ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభు

పెందుర్తి: శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందని గ్రాండ్ పిరమిడ్ మాస్టర్ జి.ప్రభు అన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో పౌర్ణమి సందర్భంగా ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, నిరంతర జీవన ప్రక్రియలో ధ్యానం ఆవశ్యకతను వివరించారు. ధ్యాన మాస్టర్లు, సీనియర్ కౌన్సిలర్లు, ధ్యాన కేంద్ర నిర్వాహకులు, ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



రాళ్లుతేలి దారుణంగా ఉన్న ఎన్టీపీసీ రోడ్డు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం–నునపర్తి కూడలి మధ్య రూ.లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. కేవలం ఎన్టీపీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల రాకపోకల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఈ రోడ్డు కొంత కాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఉద్యోగులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం సుమారు రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన బీటీ రోడ్డు రాళ్లు తేలిపోయి, ఛిద్రమైంది. దీంతో ఉద్యోగులు క్వార్టర్స్ నుంచి పోలిపల్లి కూడలి తిరిగి, అదనపు ప్రయాణం సాగించి ఎన్టీపీసీకి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు శిథిలమవడంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో ఏర్పాటు చేసిన వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. విద్యుత్ స్తంభాలు జంగుపట్టి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన బీటీ రోడ్డుతోపాటు, విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేపట్టేలా ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ పరమైన మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, దోసూరు పంచాయతీల పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

పెందుర్తి: ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంఘమిత్ర కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులతో గురువారం విశాఖ సాగరతీరంలో అవయవదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మరణించినా.. అవయవదానంతో మరి కొందరికి జీవితాన్నిచ్చి, మరోసారి జీవించవచ్చని నినాదాలు చేశారు. బీచ్ రోడ్డులో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను, జీవన్ దాన్ కో ఆర్డినేటర్ రాంబాబు, కళాశాల ప్రతినిధి తిమ్మ నారాయణతేజ, శెట్టి ప్రీతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

900 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం బస్తాలున్న వ్యాన్‌తో పోలీసులు

పెందుర్తి: గాజువాక ప్రాంతం నుంచి సబ్బవరానికి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపు జగ్గరాజుపేట వద్ద టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. పూసర్ల అచ్చిబాబు అనే వ్యక్తి టాటా ఏస్ వాహనంలో 23 బస్తాల(900 కిలోల) పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్ ఎస్ఐ భరత్‌కుమార్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ అసిరితాత కలిసి కాపుకాసి వాహనాన్ని అడ్డుకున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

సింహగిరిపై కామదహన పూజలు



సింహగిరి మాడ వీధిలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై గురువారం రాత్రి కామదహనం పూజలు విశేషంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తిరువీధిగా మాడవీధిలో ఊరేగించి, జోడు భద్రాలవద్ద కొలువుంచారు. అనంతరం హోమం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు చక్రవర్తి, శ్రీకాంత్, వేద పండితులు ఈ పూజలు జరిపారు.

అంబరాన్నంటిన ముత్యమాంబ సంబరం



వేపగుంటలో పూజలందుకుంటున్న ముత్యమాంబ అమ్మవారు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

పోటెత్తిన సమీప గ్రామాల భక్తజనం

పెందుర్తి: వేపగుంటలో కొలువుదీరిన 15 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత ముత్యమాంబ అమ్మవారి వార్షిక పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు–కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూర్తిగా వెండి, బంగారు ఆభరణాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు వేపగుంట పురవీధుల్లో వేడుకగా సాగింది. అనుపోత్సవం ఘనంగా చేశారు. వివిధ వేదికలపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా.. అమ్మవార్ల పండగ



అంతకాపల్లి ముత్యమాంబ తొలేళ్ల సంబరంలో పూలరథం ఊరేగింపు



బంగారమ్మపాలెం ముత్యమాంబ సన్నిధిలో గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లి, అంతకాపల్లి ముత్యమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పరిసర గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ప్రారంభించారు. తొలేళ్ల సంబరంలో భాగంగా బుధవారం రాత్రి అంతకాపల్లిలో అమ్మవారిని పూలరథంపై ఊరేగించారు. వేలాదిగా భక్తులు ఈ ఉరేగింపు మహోత్సవంలో పాల్గొన్నారు. మహిళా కోలాటం పోటీలు, పురుషులు మహిళా వేషధారణలో గరగలు కట్టి చేసిన నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రూ.లక్షల విలువైన బాణసంచా వెలుగులతో అనుపు మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

- మండలంలోని బంగారమ్మపాలెంలో కొలువైన ముత్యమాంబ పండగ మహోత్సవం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయుకులు, గ్రామ పెద్దలు రాపేటి రాము, దాడి కన్నంనాయుడు, కోరిబిల్లి నూకరాజు, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.